# పండ్రెండవ ప్రసంగము

మధ్యాహ్నము కాలాభాయి నిత్యానందస్వామివారిని ప్రశ్నించెను :—

ఆత్మను దేహేంద్రియములకు భిన్నముగా ఎట్లు చూడనగును?

స్వా. ని. :— *తం స్వాచ్ఛరీరాత్ ప్రవృహేన్ముఞ్జాదివేషీకాం ధైర్యేణ।*
*తం విద్యాచ్ఛుక్రమమృతం తం విద్యాచ్ఛుక్రమమృతమితి॥*

(శ్రుతి)

"ముంజగడ్డినుండి దాని ఈనెను తీయవలెననిన చాల జాగ్రత్తతో బయటకు తీయవలెను. అటులనే బుద్ధిమంతుడు స్థూల, సూక్ష్మ, కారణ శరీరములకు భిన్నమగు మహాకారణరూపమగు ఆత్మను చూడవలెను, అది పరిశుద్ధమగు అమృతస్వరూపము అని తెలిసికొనవలెను."

తైత్తిరీయోపనిషత్తునందు స్థూలశరీరమునందు అన్నమయ కోశము, సూక్ష్మశరీరమునందు ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ కోశములును, కారణశరీరమునందు ఆనందమయకోశమును కలవు అని చెప్పబడినది. కోశములనగా ఆవరణములు. కత్తిని వర ఆవరించి ఉండునట్లు అన్నమయాది పంచకోశములును ఆత్మస్వరూపమును ఆచ్ఛాదించును.

శ్రీ విద్యారణ్యులు పంచదశియందు చెప్పిరి :—

*అన్నం ప్రాణో మనో బుద్ధిరానన్దశ్చేతి పఞ్చ తే।*
*కోశాస్తైరావృతః స్వాత్మా విస్మృత్యా సంసృతిం వ్రజేత్॥*

"అన్నము, ప్రాణము, మనస్సు, బుద్ధి (విజ్ఞానము), ఆనందము అనునవి ౫ కోశములు. వానిచే ఆవృతమైన ఆత్మ విస్మృతివలన ప్రపంచమును పొందును."

అన్నమయకోశము:-

స్యాత్పఞ్చీకృతభూతోత్థో దేహః స్థూలోఽన్నసంజ్ఞకః

"పంచీకృత మహాభూతములనుండి ఉద్భవించిన స్థూలశరీరము అన్నమునుండియే ఉద్భవించి. వృద్ధిపొందుచుండుటచే అన్నమయ కోశము అనబడును." అది ఆత్మకాదు. ఏలనన:-

1. అన్నమయ కోశముయొక్క ఉత్పత్తియు, వినాశము జరుగుట కన్పించును. ఉత్పత్తి, వినాశములు కలవస్తువు ఘటాదులవలె అనాత్మ అగును. ఆత్మ అనాది, అవినాశి. కావున అన్నమయ కోశము ఆత్మ కాదు.

2. స్థూలదేహము బాల్యావస్థ, యువావస్థ, వృద్ధావస్థలచే వికారమును పొందును. ఆత్మ అవికారి. కావున అన్నమయకోశము (స్థూలదేహము) ఆత్మ కాదు.

3. అన్నమయకోశమును ఆత్మ అని అంగీకరించునచో కృతనాశము, అకృతాభ్యాగమము అను రెండు దోషములు పట్టును.

కృతనాశము:—అనగా, చేసిన కర్మల ఫలమును అనుభవించకుండ అన్నమయకోశము (స్థూలశరీరము) ద్వారా పుణ్యపాపములు ఏమిచేసిన వానిని ఈశరీరమున అనుభవించకుండ నశించిపోవును అని అంగీకరించవలసివచ్చును.

అకృతాభ్యాగమము:—అనగా, చేయని పుణ్యపాపములకు సుఖదుఃఖరూపమగు ఫలము లభించుట.

నూతనముగా ఉత్పన్నమయిన శరీరము ఏపుణ్యపాపములను చేయకుండగనే జననకాలమునుండియు సుఖదుఃఖానుభవమును పొందును. కర్మమును ఆచరించనిదే కర్మఫలప్రాప్తి శాస్త్రవిరుద్ధము.

నేను స్థూలముగా నున్నాను, నేను బలహీనముగా నున్నాను, నేను మనుష్యుడను- అను ప్రతీతులయందు "నేను" అను శబ్దము

ద్వారా ఆత్మకు బయలు శరీరమునందు కలుగు ప్రతీతి రక్తస్ఫటికా, దులయందు కలుగు భ్రాంతివంటిది. రక్తపుష్పము శ్వేతస్ఫటికము క్రింద ఉంచినచో దాని ఎరుపు స్ఫటికమునందు కన్పించి, స్ఫటికము ఎరుపు అను భ్రాంతి కలుగును. ఇటులనే స్థూలత్వ, కృశత్వ,మనుష్య త్వాదుల భ్రాంతి శరీరమునందు కలుగును.

నాశరీరము ఆరోగ్యముగా నున్నది, అనారోగ్యముగా నున్నది మొదలగు అనుభవములుకూడ అందరకును కలుగును. అనుభవముచే దేహద్రష్టయును, సాక్షియును అగు ఆత్మ దేహభిన్నమని రుజు వగును. ఇటులనే శ్రుతి, యుక్తి, అనుభవము మొదలగు ప్రమాణము లన్నిటిచేతను ఆత్మ స్థూలశరీరమునకు భిన్నము అని రుజువగుచున్నది.

ప్రాణమయకోశము :-

*లిఙ్గేతు రాజసైః ప్రాణైః ప్రాణః కర్మేన్ద్రియైస్సహ,*

"లింగదేహమునందలి రజోగుణయుక్తములగు ప్రాణ, కర్మేం ద్రియములు ప్రాణమయకోశ మనబడును."

అపంచీకృతమహాభూతములనుండి రజోగుణముచే జనించిన ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానము లనబడు 5 ప్రాణము లును వాక్కు, పాణి, పాదము, గుదము, లింగము- ఈ అయిదు కర్మేంద్రియములును ప్రాణమయకోశ మనబడును.

ప్రాణమయకోశస్వరూపమును విద్యారణ్యులు ఇట్లు సెలవిచ్చిరి:-

*పూర్ణో దేహే బలం యచ్ఛన్నక్షాణాం యః ప్రవర్తకః,*
*వాయుః ప్రాణమయో నాసావాత్మా చైతన్యవర్జనాత్॥*

"దేహమునందు వ్యాపించియుండి బలము కలిగించునదియు, ఇంద్రియములను ప్రవర్తింపజేయునదియును, అగు వాయువు ప్రాణ మయకోశము. ఇది చైతన్యరహితమగుటచే ఆత్మ కాదు."

ప్రాణమునకు క్రియాభేదముచే 5 వేరువేరు పేర్లు కలవు.

1. హృదయమున ఉండి క్షుత్పిపాసాది ఇచ్ఛలను కలుగ జేయునది ప్రాణము.

2. గుదమున ఉండి మలమూత్రవిసర్జనమును చేయునది అపానము.

3. నాభియందు ఉండి ఖాద్యపాచ్యములగు అన్నజలాదులను జీర్ణముచేయునది సమానము.

4. కంఠమున ఉండి శ్వాసింపజేయునది ఉదానము.

5 శరీరమంతటను ఉండి రససమ్మేళనముచేయునది వ్యానము.

ఈ ఐదు ప్రాణవాయువులే కాక మరి అయిదు ఉపవాయువులు కూడ కలవు. ఇవి పృథ్వి, జలము, తేజము, వాయువు, ఆకాశము అను ఈ ఐదింటియొక్క రజోగుణముచేతను ఉద్భవించి ప్రకటనము, కనురెప్పలు కదల్చుట, తుమ్ముట, ఆవలించుట, శవమును ఉబ్బించుట అను క్రియలను చేయును. క్రమముగా ఈ ఉపవాయువులు నాగము, కూర్మము, కృకరము, దేవదత్తము, ధనంజయము అనబడును.

శరీరమునందలి బలము, ప్రాణము లుండుటచేతనే ఉండును. కావున ప్రాణమయకోశముచేతను నేత్రమునందు రూపగ్రహణము, శ్రోత్రమునందు శబ్దగ్రహణము, త్వగింద్రియమునందు స్పర్శగ్రహణము, జిహ్వాయందు రసగ్రహణము, నాసికయందు గంధగ్రహణమును చేయు శక్తి ఉండును. అటులనే ప్రాణమయకోశముద్వారానే చేతియందు పట్టుకొనుటకును, కాలియందు నడచుటకును ఇటులనే 5 కర్మేంద్రియములందును తమ తమ కార్యములను నిర్వహించు శక్తి ఉండును.

కాని, ప్రాణములును, కర్మేంద్రియములును రజోగుణముచే జనించినవి. ఆత్మ జన్మరహితము. ప్రాణమయకోశము క్రియాశక్తి సంయుతము. ఆత్మ నిష్క్రియము. ప్రాణములు చేసిన ప్రతిచేష్టయు

ఆత్మనుండి శక్తిని గ్రహించియే చేయబడును. ఆత్మ చిత్స్వరూపమగు చేతనము. ప్రాణవాయువికారమగుటచేత బాహ్యవాయువు ఆత్మ కానట్లుగనే ప్రాణవాయువుకూడ ఆత్మకాదు. "నాకు ఆకలిదప్పికలు కలుగుచున్నవి" అను అనుభవములు రక్తస్ఫటికానుభవములవలె భ్రమరూపము కలిగియుండుటచే ప్రాణమునకు ఆత్మరూపము సిద్ధింపదు. శరీరమునుండి "ప్రాణము పోయెను, జీవుడుపోయెను" అనెడు వ్యవహారములు కూడ ప్రాణమయకోశమునందు ఆత్మయొక్క తాదాత్మ్యాభిమానముచేతనే జరుగును. కాన ప్రాణమయకోశము ఆత్మ కాదు.

మనోమయకోశము:—

సాత్త్వికైః ధీన్ద్రియైః సాకం విమర్శాత్మా మనోమయః।

సంశయయుక్తమగు మనస్సును, జ్ఞానేంద్రియములును కలసి మనోమయకోశ మనబడును. విమర్శాత్మ యనబడు పంచమహాభూతముల సాత్త్వికాంశముయొక్క కార్యరూపమగు సంకల్పవికల్పాత్మకమగు మనస్సు, అపంచీకృతమహాభూతముల సత్త్వగుణోత్పన్నములగు పంచజ్ఞానేంద్రియములును— అనగా త్వక్, చక్షుః, శ్రోత్ర, జిహ్వా, ఘ్రాణములు— ఈ ఆరును కలసి మనోమయకోశ మనబడును.

అహంతాం మమతాం దేహే గేహాదౌ చ కరోతి యః।
కామాద్యవస్థయా భ్రాన్తో నాసావాత్మా మనోమయః॥

"శరీరమునందు "శరీరమే నేను" అను అహంభావమును, స్త్రీ, పుత్ర, గృహ, ధనాదులయందు "నావి" అను మమత్వమును కలిగియుండునదియును అగుటచేతను, మనోమయకోశము దేహాదులవలె ఉత్పత్తి కలిగియుండుటచేతను ఆత్మ కాదు."

విజ్ఞానమయకోశము:—

"తైరేవ సాకం విజ్ఞానమయో ధీః నిశ్చయాత్మికా।"

"పంచమహాభూతముల సత్త్వగుణముచే ఉద్భవించిన నిశ్చయాత్మకమగు బుద్ధియు, జ్ఞానేంద్రియములును కలసి విజ్ఞానమయ కోశము అనబడును."

*లీనా సుప్తౌ వపుర్బోధే వ్యాప్నుయాదానఖాగ్రగా ।*
*చిచ్ఛాయోపేతధీర్నాత్మా విజ్ఞానమయశబ్దభాక్ ॥*

"సుషుప్తియందు లయమును పొందియు, జాగ్రదవస్థయందు నఖాగ్రపర్యంతము సమస్తశరీరమునందును వ్యాపించియుండునదియు, చిచ్ఛాయకలిగినదియు అగు బుద్ధి విజ్ఞానమయకోశము. అది ఆత్మ కాదు."

విజ్ఞానమయకోశము ఆత్మ కాదు. ఏలనన, అది సుషుప్తి అవస్థయందు అజ్ఞానమున లయమగును. కాని ఆత్మ అవినాశి. సదాప్రకాశించునది. మనోమయ, విజ్ఞానమయకోశములు ఒకే అంతఃకరణము యొక్క విభాగములు. అయినను మనస్సు అంతర్గతమగుదాని సాధనము అనగా ఇంద్రియము. కావున బాహ్యవృత్తి కలది. విజ్ఞానాత్మ (బుద్ధి) కర్త యనబడును. అది అంతర్వృత్తి కలది. ఇట్లు కరణత్వ, కర్తృత్వ భేదముచే బాహ్యత్వ, ఆంతరత్వ భేదముచే ఒకే అంతఃకరణము మనోమయ, విజ్ఞానమయకోశము లనెడు రెండునామములు కలిగియున్నది. సత్త్వ,రజోగుణముల అవస్థాభేదముచే లింగదేహమున ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయము లనెడు మూడు కోశములు వేరువేరుగా చెప్పబడినవి. రజోగుణావస్థ ప్రాణమయకోశము. సత్త్వరజోగుణమిశ్రావస్థ మనోమయకోశము. కేవలసత్త్వగుణావస్థ విజ్ఞానమయకోశము.

ఆనందమయ కోశము :—

*కారణే సత్త్వమానన్దమయో మోదాదివృత్తిభిః ।*

"కారణశరీరమునందు సత్త్వగుణము మోదాదివృత్తులతో కూడి ఆనందమయకోశ మనబడును."

అవిద్య, ప్రియము, మోదము, ప్రమోదము అనెడు వృత్తులు ఆనందమయకోశమునందు అంతర్భూతములు. కోరిన వస్తువును చూచి నందున కలుగు సుఖము 'ప్రియము.' అభీష్టవిషయ ప్రాప్తిచే కలుగు ఆనందము 'మోదము'. అనుభవముచే కలుగు సుఖము 'ప్రమోదము.'

*కాచిదన్తర్ముఖా వృత్తిరానన్దప్రతిబిమ్బభాక్ ।*
*పుణ్యభోగే భోగశాన్తౌ నిద్రారూపేణ లీయతే॥*

"పుణ్యోపభోగసమయమున ఒకానొక అంతర్ముఖవృత్తి ఆనందప్రతి బింబమును అనుభవించును. ఆ అంతర్ముఖవృత్తియే భోగశాంతిసమ యమున నిద్రారూపమున లయమగును. అది ఆనందమయకోశము."

ఈ ఆనందమయకోశము ఆత్మ కాదు. ఏలనన, దానియందలి ఆనందము ఒకానొకప్పుడు- అనగా పుణ్యోపభోగసమయమునను, గాఢ నిద్రయందును మాత్రము ఉండును. విద్యుత్తుయొక్క ప్రకాశమువలె అది క్షణికము. సుఖానుభవవిషయములయందు సుఖాదివిషయముల సంయోగము ఉండునంతవరకు మాత్రమే ఉండును. పదార్థవియో గముతో నశించును. కాని ఆత్మానందము నిత్యము. ఎప్పుడును ఒకే విధముగా నుండును.

ఈవిధముగా అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞాన మయ, ఆనందమయ కోశములు అయిదును ఆత్మజ్ఞానమునకు గల ఆవ రణము. వాటియందలి ఒకగుణముకూడ ఆత్మయందు ఉండదు. ఆత్మ వీని అన్నిటికంటెను వేరు. ఇట్లు అన్వయవ్యతిరేకములచే తెలిసికొన వలెను.

*అన్వయవ్యతిరేకాభ్యాం పఞ్చకోశవివేకతః ।*
*స్వాత్మానం తత ఉద్ధృత్య పరం బ్రహ్మ ప్రపద్యతే॥*

"అన్వయవ్యతిరేకములచే పంచకోశవివేకముచేసి వానినుండి ఆత్మను పైకితీసి అధికారియగు జీవుడు పరబ్రహ్మమును పొందును."

సర్వానువృత్తి (అన్నిటియందును ఉండుట) అన్వయము. సర్వ వ్యావృత్తి (దేనియందును ఉండకపోవుట) వ్యతిరేకము.

ఆత్మ వ్యాపకమగుటచే జాగ్రత్, స్వప్న, సుషుప్తి, సమాధి- ఈనాల్గు అవస్థలయందును అది భాసించును. కావున ఈనాల్గు అవస్థల యందును ఆత్మాన్వయము కలదు. అన్నమయాదికోశములు దేశ, కాల, వస్తువు లనబడు త్రివిధపరిచ్ఛేదయుక్తములగుటచే పైనాల్గు అవస్థలయందును భాసించవు.

స్థూలశరీరము స్వప్న, సుషుప్తి అవస్థలయందు భాసించదు. కావున ఈ అవస్థలయందు వ్యతిరేకము కలదు. కాని ఆత్మకు అన్వయము కలదు. ఆ కారణముచే అవి అన్నమయకోశమను స్థూలశరీరమునకు భిన్నములు.

జాగృతియందు స్థూలశరీరము, ఆత్మ రెండును భాసించును. స్వప్నావస్థయందు కనిన స్వప్నములు జాగ్రదవస్థయందు జ్ఞాపకముం డుటచే "స్వప్నమునందు ఆత్మ ఉన్నది" అని ఋజువగును. సుషుప్తి యందు ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ కోశము లనబడు సూక్ష్మశరీరము భాసించదు. అందు మనస్సు, బుద్ధి, మొదలగునవి అన్నియు లయమును పొందును. కాని జాగృతి కలిగినంతనే "నేను చాల నిద్రించితిని, నిద్రలో నాకేమియు తెలియలేదు" అని సుషుప్తి యందలి సుఖము, అజ్ఞానము జ్ఞాపకము ఉండును. ఆ అనుభవము కలిగినది ఆత్మ. సాక్షిరూపమగు భాసము స్ఫురించుటచే సుషుప్తి యందు ఆత్మకు అన్వయము, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ కోశముల (లింగదేహముయొక్క) అభావముచే వాని వ్యతిరేకము కలదు.

సమాధియందు ఆత్మ స్ఫురించుటచే అన్వయము. సుషుప్తి యందు భాసించు అజ్ఞానము స్ఫురించనందున ఆనందమయకోశరూప కారణాజ్ఞానమునకు అక్కడ వ్యతిరేకము.

ఆత్మ అన్నమయాదికోశములకు భిన్నము. "స వా ఏష పురుషోఽన్నరసమయః" "ఆపురుషుడు అన్నరసమయుడు" అని మొదలిడి "తస్మాద్వా ఏతస్మాదన్నరసమయాదన్యోఽన్తరాత్మా ప్రాణమయః" "కావున ఆ అన్నరసమయభిన్నమగు అంతరాత్మ ప్రాణమయ"మనియు "అన్యోఽన్తరాత్మా మనోమయః" "దానికి భిన్నమగునది మనోమయము," అనియు "అన్యోఽన్తరాత్మా విజ్ఞానమయః" "తద్భిన్నమగు అంతరాత్మ విజ్ఞానమయ"మనియు "అన్యోఽన్తరాత్మాఽఽనన్దమయః" "తద్భిన్నమగు అంతరాత్మ ఆనందమయ" మనియు తైత్తిరీయోపనిషత్తునందు చెప్పబడినది. దాని తాత్పర్యము- అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశములను ఆత్మభిన్నముగా అంగీకరింపజేయుట కాదు. జిజ్ఞాసువునకు సోపానక్రమముగా శుద్ధమగు ఆత్మను తెలియజేయుట మాత్రమే.

ఆత్మ అని దేనిని అంగీకరించవలెను అను విషయమున మతాంతరము కలదు. విరోచనమతావలంబులు స్థూలశరీరమునే ఆత్మగా నంగీకరించి ఈ వాదమును చెప్పుదురు. "అహంబుద్ధి అనగా అత్యంతప్రియబుద్ధి కలుగునదియే ఆత్మ. నేను మనుష్యుడను, నేను బ్రాహ్మణుడను అనువానియందు ప్రీతిస్థానములగు మనుష్యత్వ, బ్రాహ్మణత్వములు స్థూలశరీరమునందే భాసించుటచే స్థూలశరీరమే అహంబుద్ధికి విషయము. స్త్రీ, పుత్ర, ధనాదులకు స్థూలశరీరముతోనే సంబంధము కలదు. కావుననే వానియందు ప్రేమ కలుగును. దేని ద్వారా ఇతరపదార్థములయందు ప్రేమ కలుగునో ఆస్థూలశరీరము అన్నిటికంటెను ఎక్కువ ప్రియమైన దగుటచే స్థూలశరీరమే ఆత్మ."

కావున దానిని నానావిధభోజనములతోడను, శృంగారములతోడను బలపరచవలెను; శృంగారించవలెను. అదియే పురుషార్థము. అది తప్ప వేరొక ఆత్మ లేకపోవుటయే ఇందుకు కారణము.

కొందరు స్థూలదేహమును కాక ఇంద్రియములనే ఆత్మగా నంగీకరించెదరు. వారి వాదముప్రకారము వేనిచే జీవనవ్యవహారము జరుగునో, ఏవి లేనిచో నది ఆగిపోవునో అదియే ఆత్మ. "నేను చూచుచున్నాను, వినుచున్నాను" మొదలగు అహంబుద్ధి ఇంద్రియములయందే ఉండుటచే ఇంద్రియములే ఆత్మ.

కొందరు ఇంద్రియములను కాక ప్రాణములనే ఆత్మగా నంగీకరించెదరు. "మృత్యుసమయమున శరీరమున ప్రాణములు ఉన్నచో 'బ్రతికి ఉన్నా'డని చెప్పుదుము. అటులనే ప్రాణములు లేనిచో 'చనిపోయెను', అని చెప్పుదుము. ఇంద్రియవినాశముచే మానవునకు ఆఇంద్రియలోపమును మాత్రమే చెప్పుదురు. కండ్లు లేనిచో గ్రుడ్డివాడు, చెవులు లేనిచో చెవిటివాడు మొదలగునవి. కాని ప్రాణములు లేని శరీరము అమంగళము, భయంకరము అయిపోవును. ఇంద్రియములనే ఆత్మగా అంగీకరించవలెనన్న "నేత్రస్వరూపుడనగు నేను చూచుచున్నాను, శ్రవణస్వరూపుడనగు నేను వినుచున్నాను." అను ప్రతీతి కలుగవలెను. కాని అట్లు కలుగక "నాకు కళ్ళు ఉన్నవి. నాకు చెవులు ఉన్నవి" అని ప్రతీతి కలుగుటచే ఆత్మ ఇంద్రియములకు భిన్నమైనది. ఇది రుజువైన అనంతరము ఆ ఆత్మ ప్రాణములు అనియే అంగీకరించవలెను."

కొందరు ప్రాణములు జడములు, అనాత్మ అని అంగీకరించి, మనస్సును ఆత్మగా నంగీకరించెదరు. మనస్సు ఇంద్రియజ్ఞానమునకును, సకలవ్యవహారములకును, బంధమోక్షములకును కారణమగుటచే అదియే ఆత్మ. తద్వ్యతిరిక్తమగు ఆత్మ లేదు.

క్షణికవిజ్ఞానవాదులగు బౌద్ధులు బుద్ధిని ఆత్మగా తలచెదరు. ఇది వారి వాదము:-

"పదార్థములన్నియు విజ్ఞానముయొక్క ఆకారములు. ఈవిజ్ఞానము ప్రకాశరూపము. ప్రతిక్షణమునందును విజ్ఞానము ఉద్భవించును,

నశించును. ప్రథమవిజ్ఞానమువలె ద్వితీయవిజ్ఞానము జన్మించినతోడనే ప్రథమవిజ్ఞానము నశించును. అటులనే తృతీయవిజ్ఞానముయొక్క ఉత్పత్తి ద్వితీయవిజ్ఞానముయొక్క నాశము, చతుర్థవిజ్ఞానముయొక్క ఉత్పత్తి తృతీయవిజ్ఞానముయొక్క నాశము అగును. ఇటులనే నదీప్రవాహము వలె విజ్ఞానధార ప్రవహించును. ఈవిజ్ఞానధార "ఆలయవిజ్ఞానధార" "ప్రవృత్తివిజ్ఞానధార" అని రెండురకములు. "అహం" అను జ్ఞానము ఆలయవిజ్ఞానధార అనియు "ఇది ఘటము" అను జ్ఞానము ప్రవృత్తి విజ్ఞానధార అనియు అనెదరు. ఆలయవిజ్ఞానధారనుండి ప్రవృత్తివిజ్ఞాన ధార పుట్టును. మనస్సుయొక్క స్వరూపము ప్రవృత్తివిజ్ఞానధార యందు ఉన్నది. కావున మనస్సు ఆలయవిజ్ఞానాధారరూపమగు బుద్ధి యొక్క కార్యము. ఆబుద్ధియే ఆత్మ." ఇట్లు బుద్ధిని క్షణికరూపము గను, స్వయంప్రకాశముగను స్వీకరించి దానిని ఆత్మగా చెప్పుదురు.

పూర్వమీమాంసావార్తికకారుడగు భట్టుని అభిప్రాయము ప్రకారము ఆనందమయకోశము ఆత్మ. మెరపువలె ఆత్మ క్షణికము కాదు. స్థిరమైనది. అది జడచేతనరూపము. సుషుప్తినుండి లేచిన జనుడు నేను జడత్వమునొంది నిద్రించితిని అనిచెప్పును. కావున ఆత్మ జడరూపము. మేల్కొనినతరువాత తన అవస్థాజ్ఞానము కలుగును. ఆత్మస్వరూపముతప్ప మరియొక జ్ఞానసాధనము సుషుప్తియందు లేదు. సుషుప్తియందలి స్మృతికి హేతువు జ్ఞానము. అజ్ఞానమే ఆత్మస్వరూపము. ఇటులనే ఆత్మ ఖద్యోతము (మెరుగుడుపురుగు)వలె ప్రకాశ, అప్రకాశరూపము. ఆనందమయకోశముకూడ ప్రకాశ, అప్రకాశ రూపమే. ఏలనన, సుషుప్తియందు చేతనాభాససహిత అజ్ఞానము ఆనంద మయకోశము. అందు ఆభాసము ప్రకాశరూపముగను, అజ్ఞానము అప్రకాశరూపమునను ఉన్నవి. కావున ఆనందమయకోశమే ఆత్మ.

శూన్యవాదులగు మధ్యమమార్గానుయాయులైన బౌద్ధులు శూన్యమునే ఆత్మగా తలచెదరు. ఆత్మ నిరంశము. అది ప్రకాశ

రూపమును కాదు. అప్రకాశరూపమును కాదు. ఆత్మను ప్రకాశ, అప్రకాశరూపమని చెప్పినచో అది సాంశమని ఒప్పుకొనవలెను. సాంశములగు ఘటాదిపదార్థములను మనము చూచుచున్నాము కదా! అవి ఉత్పత్తియు, నాశమును కలవి.

కావున ఆత్మకుకూడ ఉత్పత్తియు, నాశమును ఒప్పుకొనవలెను. ఉత్పత్తినాశములుకల పదార్థములకు ఉత్పత్తికి పూర్వమును, నాశమునకు తరువాతను అస్తిత్వము ఉండదు. కావున అవి "అసత్" అనబడును. ఆద్యంతములయందు అసత్ అయినవి మధ్యమునందు కూడ అసత్ పదార్థములే. ఇవ్విధముగా జగత్తునందలి పదార్థములు అన్నియు అసత్ లే. అటులనే ఆత్మ ప్రకాశ అప్రకాశ రూపమగుటచే సాంశము. కావున ఉత్పత్తియు, అంతమును కలది. కావున "అసత్." ఇట్లు ఆత్మయు, అనాత్మయు అన్నియు 'అసత్' రూపము గలిగియుండుటచే శూన్యమే పరమతత్త్వము.

వారు అజ్ఞానరూపమగు ఆనందమయకోశమును ప్రతిపాదించుచు, అజ్ఞానము మూడువిధములుగా ప్రతీతమగును అని అంగీకరించెదరు :—

అది ఎట్లనిన :—

1. అద్వైతశాస్త్రసంస్కారము లేనివారు అజ్ఞానము జగద్రూపమగు పరిణామము నొందెను అని అంగీకరించెదరు.

2. అద్వైతశాస్త్రజ్ఞులగు విద్వాంసులకు అజ్ఞానము, దాని కార్యమగు జగత్తు సదసద్విలక్షణమగుఅనిర్వచనీయరూపముగ ప్రతీతమగును.

3. జ్ఞాననిష్ఠను పొందిన జీవన్ముక్తుడగు విద్వాంసునకు కార్యసహితమగు అజ్ఞానము తుచ్ఛమని ప్రతీత మగును.

ఈ తుచ్ఛము, అసత్తు, శూన్యము— ఇవి సమానార్థకములగు శబ్దములు అని చెప్పు శూన్యవాదులు జీవన్ముక్తునకు తుచ్ఛరూపమున అజ్ఞానప్రీతి కలుగుటయందు కల పరమపురుషార్థమును ఎరుగక అజ్ఞానరూపమగు ఆనందమయకోశమునకు అజ్ఞానరూపత్వమును, శూన్యత్వమునకు మహత్త్వమును ఆపాదించి శూన్యమే ఆత్మ అని తలచెదరు.

పూర్వమీమాంసకులగు ప్రభాకరులును, నైయాయికులును శూన్యమును కాక ఆనందమయకోశమును ఆత్మ అని యెదరు. శూన్యానుభవము కలుగుటచే ఆత్మ శూన్యముకంటె విలక్షణమైనది. ఆత్మయందు మనస్సంయోగముచే జ్ఞానము కలుగును. జ్ఞానగుణముచే ఆత్మ జడమైనను చేతన మనబడును. విజ్ఞానమయకోశమునందలి బుద్ధి ఆత్మయొక్క గుణమగు జ్ఞానము.

వారు ఇదికూడ అంగీకరించెదరు. "ఆనందమయకోశమున చేతనము గుప్తముగా నుండును. అది వివేకహీనునకు ప్రతీత మవదు. సుషుప్తియందు జ్ఞానహీనతను చెందుటచే ఆత్మ జడము. కాని గూఢ చేతనమగు ఆనందమయకోశమే ఆత్మ. బుద్ధి దానిగుణము."

ఈ మతాంతరములన్నియు విజ్ఞాసువును గంద్రగోళపరచును. వివేకి వానిని త్యజించుట యుక్తము. శ్రుతి, యుక్తి, అనుభవము— వీనిని ఆధారముగా తీసికొని విచారించిన ఆత్మతత్త్వము పంచకోశములకును భిన్నము. ఈనిశ్చయముతో దానిని పొందుటకు ప్రయత్నించుము.

డా. లల్లూభాయి:— పంచకోశాదులకు భిన్నమయిన ఆత్మను తెలుసుకొనుటకు సాధనమేమి?

స్వా. ని.:- — ధ్యానయోగముచే పరమాత్మను తెలిసికొనవచ్చును.

డా. ల॥:— ఎవరిని ధ్యానించవలెను?

స్వా. ని.:— పరమాత్మను ధ్యానించవలెను.

డా. ల॥:—గురువుని ధ్యానించవచ్చునా?

స్వా. ని.:— గురుదృక్పథముతో రామ, కృష్ణాదిమూర్తులను ధ్యానించుట యుక్తము.

డా. ల॥:— రామ, కృష్ణాదులు ఈకాలమున లేరు. గురువులు ఈకాలమున ప్రిత్యక్షముగా కన్పించుచున్నారు. వారిని ధ్యానించరాదా?

అంతట నిత్యానందస్వామివారు ప్రికాశానందులవారిని సమాధానము చెప్పుమని సూచించిరి.

స్వా. ప్రి.:— స్వామివారు చెప్పినది సరియైనది. గురుదృక్పథమున రామ, కృష్ణాది అవతారపురుషులను ధ్యానించుట చాల మంచిది.

డా. ల.:— మా గురువులు ప్రత్యక్షమగు 2వ అవతారమనియు, రామకృష్ణాదులు భూతకాలపువారనియు' గురువులు వర్తమానకాలపువారనియు, వారినే ధ్యానించుట యుక్తమనియు మా మిత్రులు చెప్పుదురు.

## దేవపూజచేయక మానవపూజ చేయు మానవులు.

స్వా. ప్రి.:– ఒక హిందూఆచార్యులు, మహమ్మదీయగురువు ఉండిరి. వీరిరువురకు స్నేహము. వీరిరువురకును ఒకమారు స్వర్గమునకు వెళ్ళి దేవదర్శనము చేయవలెనని తోచెను. వారు స్వర్గమునకు వెళ్ళిరి. దేవుని దర్శించవలెననిన ఒంటరిగా దర్శించవచ్చునా, లేక ఆచార్యులతోను, గురువులతోను కూడియుండగా దర్శించవలెనా అను సంశయము కలిగెను. సాయంకాలమువరకు అక్కడనే తిరుగుచు ఉండి సంధ్యాకాలమున ఒకమార్గముప్రికటన్ను నిలబడిరి. ఆమార్గ

మున దేవుడు వచ్చుననియు ,అతని దర్శనము చేసికొనవచ్చుననియు వారి ఉద్దేశ్యము. ఆమార్గమున అనేకవాహనములు వచ్చెను. అందులో మొదటి సవారి శంకరాచార్యులవారిది.వారు చేతియందు దండము ధరించియుండిరి. వారివెనుక కోట్లకొలది సన్యాసులు ఇతరులు నడిచి వచ్చుచుండిరి. మహమ్మదీయగురువు "వారెవ్వరు" అని అడిగెను. వారు 'శంకరాచార్యులు' అని ఆచార్యులు సమాధానము చెప్పెను. వారివెనుక రామానుజాచార్యులు వచ్చిరి. వారిని అనుసరించి లక్షలకొలది ఊర్ధ్వపుండ్రధారులగు త్రిదండిసన్యాసులు వారి సేవకులవలె వచ్చిరి. వారివెనుక వల్లభాచార్యులవాహనము వచ్చెను. వారితో కూడ వేలకొలది శిష్యులు ఉండిరి. అంతట గౌతమబుద్ధుడు తన కోట్లకొలదిసేవకులతో వచ్చెను. వారితరువాత లక్షలకొలదిసేవకులతో మహావీరస్వామి వచ్చెను. అనంతరము గుర్రముపై మహమ్మదీయ పైగంబరు వాహనము వచ్చెను.ఆచార్యులు గురువును అడిగెను. "వీరు ఎవరు?" మహమ్మదీయగురువు చెప్పెను. "మహమ్మదు పైగంబరుగారు." వారివెనుక లక్షలు, కోట్లు సంఖ్యలో వారి అనుచరులు వచ్చిరి తరువాత జరథుస్త్ర చేత నగ్నిని ధరించి వచ్చెను. వారివెంట వారి సేవకులు వేలకొలది వచ్చిరి. అనంతరము జీసస్‌క్రీస్తు వచ్చెను. అతని వెంట ఒకశిష్యుడు కాసుపట్టుకొని వచ్చుచుండెను. అతనిని కోట్లకొలదిజనులు వెంబడించిరి. వీరి అందరి తరువాతను ఒకవృద్ధుడు చేతిలో కర్ర తీసికొని చిరిగిన లంగోటీ కట్టుకొని నెమ్మదినెమ్మదిగా నడచుచు వచ్చుచుండెను. అతనివెనుక పది, పదిహేనుమంది మాత్రము కన్పడిరి. ఆచార్యులు "వీరెవ్వరు"? అని అడిగిరి. మహమ్మదీయగురువు "అల్లామియా" (దేవుడు) అని సమాధానము చెప్పెను. ఆచార్యులు అడిగెను. "ఆమహానుభావులవెనుక అంత అట్టహాసములతో కోట్లకొలది మనుష్యులు ఉన్నారు కదా! "అల్లామియా" వెనుక ఇంత తక్కువమంది ఉండుటకు కారణమేమి? గురువు జవాబుచెప్పెను.

"ప్రపంచమున మానవపూజ ఎక్కువ. దైవపూజ తక్కువ. చాల మంది మనుష్యులను అనుసరించువారే. దేవుని అనుసరించువారు చాలతక్కువగా ఉందురు."

అందుచేత గుర్వాదులను ధ్యానించువారు ఈరోజులలో ఎక్కువమంది ఉన్నారు. దేవుని వేదోక్తవిధానమున ఉపాసించువారు చాలతక్కువమంది.

డా. లల్లు:— మామిత్రులు నన్ను వారిగుంపులో కలుపుకొనుటకు ఎంతైనా ప్రయత్నించిరి. కాని నేను మాత్రము వెళ్ళలేదు.

## గుడ్డినమ్మకపు సంప్రదాయము

స్వా.ని. :– ఒక రాజధానియందు ఒక గురువు, వారియొక్క 506 గురు శిష్యులు ఉండిరి. వారు ఏదియో దుష్కార్యమునకు ఒడబడిరి. కావున అచ్చటిరాజు వారిని అందరను ముక్కులుకోసి అవమానించి రాజ్యమునుండి తరిమివేసెను. వారు అచ్చటనుండి బయలుదేరి మరియొక రాజ్యమునకు చేరిరి. వారుఅందరు శాస్త్రాభ్యాసము చేసియుండిరి. సంగీతాదుల జ్ఞానముకూడ వారికి ఎక్కువగనే ఉండెను. వారు హరికథ చెప్పి, తరువాత తబల మొదలగు వాద్యములతో భజన చేసెడివారు. అందరి ముకుకులు కోయబడియుండెను. జనులు వారిని "మీా ముకుకులేల కోయబడినవి?" అని అడిగిరి. వారి గురువు ఇట్లనెను. "దేవదర్శనమునకు ముకుకు అడ్డము. కావున దానిని కోసికొని దీక్ష గైకొంటిమి."

ప్రజలు గుడ్డినమ్మకము కలవారు. కావున వారు అందరును భగవదర్శనమునకు ముక్కులు కోయించుకొని దీక్ష గైకొనిరి. అట్లు వారు 'ముక్కిడి' సంప్రదాయములో చేరిరి. ఇట్లు రెండు, మూడు సంవత్సరములు జరుగుసరికి 'ముకుక్కిడి' సంప్రదాయములోని శిష్యుల

సంఖ్య వేలవరకు పెరిగెను. వీరు అందరును ఇతరులకు ఇట్లు బోధించెడివారు. "ఓహో, ముక్కులు కోయించుకొనినతరువాత వారికి దేవదర్శనము కలిగినది, చూచితిరా! మేము నిరంతరము ప్రభుదర్శన భాగ్యమును కలిగియున్నాము. ఇట్టి మహద్భాగ్యము ఎవరికి కలుగునో వారే మావలె దేవదర్శనము చేయగలరు." ఇట్లు వర్ణించి వర్ణించి తమవలె ఇతరులను కూడ చేసి వారిని తమలో కలుపుకొనెడివారు. ఇది అందరకు తెలిసి అక్కడిరాజుకూడ వారిదర్శనము చేయగోరెను. ఆయనకు దేవదర్శనము చేయవలెనని కోరిక కలిగి గురువును దీక్ష ఇమ్మని కోరెను. ఈసంగతి ఆయన తాతగారి సమకాలికుడగు 90 సంవత్సరముల వయస్సుకల పూర్వపు దివానుకు తెలిసెను. వెంటనే అతడు రాజుచెంతకు వచ్చి అడిగెను :-

"తమరు దీక్షతీసికొనుటకు వెళ్లుచున్నారని విన్నాను. నిజమేనా?"

రాజు :—"పరమాత్ముని దర్శనమగుచున్నప్పుడు దీక్షతీసికొనుటలో విశేషమేమి ఉన్నది?"

దివాను :-"వంశానుగతముగా నేను తమకు ఋణపడియున్నాను. తమను రక్షించుట మాధర్మము. తమవయస్సు చాల తక్కువ. ప్రపంచములో ముక్కు ఉండుట చాల అవసరము. ముక్కులేని మనుష్యుడు మనుష్యుడు కాడు. పైగా తమరు రాజుగారు. వయస్సు చాలతక్కువ. తమరిని దీక్షగైకొనవద్దని నేను చెప్పుటలేదు. నాకు 90 సంవత్సరములు పూర్తి అయినవి. నాజీవితము కొద్ది మాసములు మాత్రమే మిగిలియున్నది. ముందు నేను దీక్ష గైకొని దేవదర్శనము అయినచో తమరు తీసికొనవచ్చును." ఇట్లు చెప్పి అతడు హారాదులను కానుకగా తీసికొని గురువుచెంతకు వెళ్లి దీక్ష ఇమ్మని ప్రార్థించెను. ఇంత పెద్దచేప తనవలలో చిక్కుకొనుటకు ఆశ్చర్య

పడి, గురువు "సరే" అనెను. దీక్షనిచ్చు రోజును నిశ్చయించెను. దివాను ఇంటికి వెళ్ళి సైన్యాధిపతిని పిలచి చెప్పెను— "నీవు 25, 30 మంది సైనికులను వెంటబెట్టుకొని వచ్చి మఠమునకు చుట్టుప్రక్కల రహస్యముగా ఉండుము. నేను ఆజ్ఞాపించినంతనే వారినందరను హత్య చేయుము." ఇట్లు చెప్పి మరునాడు తీసికొనుటకు కానుకలు, పూజా సామగ్రియు తీసికొని గురువునొద్దకు వెళ్లెను. దీక్షనిచ్చు సమయమున ఎదుట గురువు కూర్చొని ఉండెను. ఇద్దరు మనుష్యులు దివాను చేతులు పట్టుకొనిరి. మూడవవాడు ముక్కు కోసెను. దీక్ష నిచ్చిన తరువాత గురువు దివానున కిట్లనెను. "ఇప్పుడు నాకు భగవానుని దర్శనమయినదని చెప్పుము."

దివాను :—"నాకు కన్పించుట లేదు."

గురువు :— "ముక్కు తెగినతరువాత దేవుడు కన్పించెనని చెప్పవలెను కదా?"

ఇది విని దివాను ఇట్లనెను:—అటులనా! ఇంతమంది ముక్కులు ఈవిధముగనే కోసి జనులను వశపరచుకొంటివా? అని చెప్పి బయటకు వచ్చెను. అతడు గుప్తముగానున్న సైనికులకు ఆజ్ఞాపించెను. వెంటనే వారందరును వధించబడిరి.

ఈ విధముగా చూచిన నీవు బుద్ధిమంతుడవు కనుక ఆ ముకుకిడి సంప్రదాయములో కలియలే దనవచ్చును. ఈ రోజులలో జనులు ఆలోచించకుండ ఒకరిని చూచి మరొకరు నేర్చుకొనుచున్నారు.

పంచతంత్రమున ఇట్లు ఉన్నది :—

*ఏకస్య కర్మ సంవీక్ష్య కరోత్యన్యోఽపి గర్హితమ్,*
*గతానుగతికో లోకో న లోకః పారమార్థికః॥*

"ఒకడు తప్పుడు పనులు చేయుట చూచి మరియొకడు వానిని అనుస

రించును. ఇట్లు ఆలోచించకుండా అనుకరించునే గాని పరమార్థమును గుర్తించువాడు లేడు.

డా. లల్లూ. :—"అయితే పరమాత్మని ఎట్లు ధ్యానించ వలెను?"

స్వా. ప్ర. :—"ఇది ఏకాంతమున తెలిసికొనవచ్చును."

స్వా. ని. :—ఇక్కడ చెప్పినను ఏమి తప్పు లేదు. ఇక్కడ సత్సంగమండలితప్ప మరొకరు లేరు. పైగా మేఘునిదృష్టి కలిగి యుండవలెను. క్షారభూమియందు జలము క్షారమయ మగును. తియ్యనిచోట నీరు తియ్యగానుండును. అటులనే అధికారి గ్రహించును. కానివాడు గ్రహించలేడు. మేఘునకు అందరు సమానము.

## పరమాత్మధ్యానమునకు అవసరమగు సాధనసంపత్తి.

స్వా. ప్రి. :— గీతయందు ఇట్లు చెప్పబడినది:—

*వివిక్తసేవీ లఘ్వాశీ యతవాక్కాయమానసః ।*
*ధ్యానయోగపరో నిత్యం వైరాగ్యం సముపాశ్రితః ॥*

"ఏకాంతమున దేశమని సేవించుచు, తక్కువభోజనము చేయుచు మనోవాక్కాయములను జయించి వైరాగ్యపరాయణుడై ధ్యానయోగనిమగ్నుడగు నరుడు బ్రహ్మసాక్షాత్కారమును పొందుటకు సమర్థుడు."

*వివిక్త సేవీ:—* ధ్యానయోగి ఏకాంతమున నుండి ధ్యానము చేయుచున్నంతకాలము విఘ్నకరములగు బాహ్యసాధనములు ఉండరాదు. విద్యుచ్ఛక్తి మొదలగు విషయములపై విజ్ఞానశాస్త్రమున పరిశోధనలు చేయువారుకూడ ఏకాంతమందే పరిశోధనలు చేసిరి. ఏకాంతములేని చిత్తవృత్తి ఏకాగ్రతను పొందదు.

'ఎడిసను' అను విజ్ఞానశాస్త్రజ్ఞుడు విద్యుచ్ఛక్తియందు పరిశోధనలు చేసెడివాడు. ఆ పరిశోధనలను అతడు ఏకాంతమున ఏకాగ్ర

చిత్తముతో చేసెడివాడు. నౌకరులు భోజనము తీసికొనివచ్చినచో తన ఏకాగ్రతకు భంగముకలుగకుండుటకై అక్కడ విడచి వెళ్ళుము. తరువాత తినెదను అని చెప్పెడివాడు. తాను తన పరిశోధనలయందే మునిగియుండెడివాడు.

కొన్నిగంటలుతరువాత నౌకరులు ఖాళీపాత్రలను తీసికొని వెళ్ళుటకు వచ్చెడివారు. అప్పటికిని ఆహారము అటులనే ఉండెడిది. ఆయన ఆవిధముగా అన్నపానములను మరచికూడ తన పరిశోధనలయందు మునిగియుండెడి వాడు. విజ్ఞానము ఆత్మవిద్యకంటె స్థూలమైనది. దానికే అంత ఏకాగ్రత అవసరమైన అతిసూక్ష్మమగు అధ్యాత్మ విద్యకు ఎంత ఏకాగ్రత కావలెను?

మనుష్యసంసర్గములేని పవిత్రములగు వనములు, పర్వత గుహాలు, తీర్థములు, దేవాలయములు మొదలగునవి ఏకాంతప్రదేశములు. ఈవిషయమున శృతి ఇట్లు చెప్పుచున్నది:—

*సమే శుచౌ శర్కరావహ్నివాలుకావివర్జితే, శబ్దజలాశయాదిభిః ।*
*మనోఽనుకూలే న తు చక్షుఃపీడనే గుహానివాతాశ్రయణే ప్రయోజయేత్ ॥*

"సమము, పవిత్రము అయినదియును, రాళ్ళు, నిప్పు, ఇసుక లేనిదియు, కలకలధ్వనిచేయు జలాశయాదులతో మనోభిరామమును, కండ్లను బాధించు వస్తువులు లేనిదియును, వాయుబాధారహితమును అగు గుహయందు చిత్తమును బ్రహ్మముతో కలుపవలెను."

దుర్గంధరహితమును, కోలాహలము లేనట్టియు, జనసంపర్కమునకు దూరముగానుండునట్టియు, ఎగుడుదిగుడులు లేనట్టియు, పవిత్రమగు ఏకాంతస్థలమునకూర్చొని ధ్యానముచేయవలెను. వృత్తిని బ్రహ్మముతో కలుపవలెను.

*వివిక్తదేశే చ సుఖాసనస్థ ఏవ శుచిః సమగ్రీవశిరశ్శరీరః ।*

"ఏకాంతస్థలమున సుఖాసనమున కూర్చొని, పవిత్రుడయి, కంఠము, శిరము, శరీరము సమముగా నుంచి ధ్యానించవలెను.

గీత ఆరవ అధ్యాయమున ఏకాంతమున ధ్యానయోగము చేయుమని చెప్పబడినది. ఇంటిలోనుండి చిత్తమును ఏకాగ్రమొనరించుట అసంభవము. కావుననే పూర్వకాలమున వ్యాసాదిమహర్షులు స్త్రీ, పుత్ర, ధనాదులను విడచి అరణ్యములోకి వెళ్ళి, ఏకాంతమున కూర్చొని ధ్యానముచేసెడివారు. 13 వ అధ్యాయమున "అరతిర్జనసంసది" అని చెప్పబడినది. జనసంపర్కమునందు ప్రేమ కూడదు అనికూడ చెప్పబడినది. కొందరు అసురసంపదకల దుర్మార్గులసంసర్గము కూడదు అనియు, దైవసంపదకల సజ్జనసంసర్గమునకు ఏమియును అభ్యంతరము లేదనియును చెప్పెదరు. కాని వాస్తవమునకు ధ్యానయోగికి వ్యక్తి సజ్జనుడా దుర్జనుడా అను భేదము లేదు. సజ్జనునితో జరిగిన సంభాషణచే పరిచయము పెరిగి ప్రపంచమున ప్రసిద్ధి కలుగును. ఈ ప్రవృత్తి ధ్యానమనెడు వృత్తికి భంగకరము.

వ్యాసభగవానుడు శుకునితో ఇట్లు చెప్పెను.

అదర్శనమస్పర్శస్తథాఽసంభాషణం సదా।
యస్య భూతైః సహ మునే స శ్రేయో విన్దతే పరమ్॥

"ఓమునీ! మానవుల దృష్టికి దూరముగా నుండవలెను. ఎవరిని ముట్టుకొనరాదు. ఎవరితోను సంభాషించరాదు. అట్టివానికి పరమకళ్యాణము కలుగును."

లఘ్వాశీ :—ఆహారమును అల్పముగా తీసికొనవలెను. సోమరితనము, నిద్ర రానంత తక్కువ ఆహారము తీసికొనవలెను. అసలే ఆహారమును భుజించరాదనికాదు. మితమగు ఆహారమును తీసికొనవలెను. గీత ఆరవ అధ్యాయము 16 వ శ్లోకమున ఇట్లున్నది.

"నాఽత్యశ్నతస్తు యోగోఽస్తి నచైకాన్తమనశ్నతః।"

"ఎక్కువ తినువానికిని, పూర్తిగా ఆకలితో నుండువానికిని యోగము కుదురదు."

"అత్యాహారమనాహారం నిత్యం యోగీ వివర్జయేత్।" అని శ్రుతి. "యోగి ఎల్లప్పుడును అత్యాహారమును, నిరాహారమును కూడ త్యజించవలెను." మితాహారిగా నుండవలెను.

ధ్యానయోగమును ఆచరించు యోగి ఆశారహితుడు, అపరిగ్రహియు అయి యుండవలెను అని గీత 6 వ అధ్యాయమున కలదు.

ధనము మొదలగు అన్నివిధములైన మాయాపదార్థముల యందును ఆశారహితుడై యోగమును చేయవలెను.

ఈవిషయమున దత్తాత్రేయులవారు పింగళ అను వేశ్య యొద్ద ఉపదేశమును స్వీకరించిన దృష్టాంతము శ్రీమద్భాగవతమున కలదు.

విదేహనగరమున పింగళ అను వేశ్య కలదు. ఆమె తన వృత్తితో చాలధనమును సంపాదించుచుండెను. ఒకరాత్రి ఆమె ప్రియునికొరకు చాల ప్రొద్దుపోవు వరకు ఎదురు చూచెను. గుమ్మము దగ్గర చాలరాత్రి గడచిపోయెను. రాజమార్గమున జనుల రాకపోకలు తగ్గిపోయెను. కాని ప్రియుడు ఎవ్వడును రాలేదు. చివరకు తన నీచవృత్తియందు విరక్తి కలిగెను. ద్రవ్యలోభముచే ఆత్మయనెడు (కోరికల నన్నిటిని తీర్చు) పతిని సేవించలేదు. ఎముకలు, మాంసము కల ప్రియుని సేవించుచు రోజులన్నియు గడచిపోయినవి. అని ఆమె మనస్సునందు ఎంతయో విచారించెను. ఆ నాటినుండి ఆమె జీవితాంతమువరకు ఆ అధమవృత్తిని త్యజింప నిశ్చయించెను. ఇట్లు తీవ్రవైరాగ్యము జన్మించి, ఆమె ఆశలనన్నిటిని త్యజించి సుఖమును పొందెను.

*ఆశా హి పరమం దుఃఖం నైరాశ్యం పరమం సుఖమ్,*
*యథా సంఛిద్య కాన్తాఽఽశాం సుఖం సుష్వాప పింగళా॥*

"ఏదయిన పదార్థము కావలెనని కోరిక కలిగియుండుట గొప్ప

దుఃఖము. ఆశను త్యజించుట గొప్పసుఖము. పింగళ ప్రియుని ఆశను త్యజించెను. కావున ఆమె సుఖముగా నిద్రించెను." అని భాగవతమున ఉన్నది.

ఇది తెలిసికొని దత్తాత్రేయులు ఇట్లు తలచిరి:—

పింగళ ద్రవ్యముకొరకు ప్రియుని ఎదురు చూచుచు నిద్రా సుఖమును కోల్పోయెను. అటులనే నేను కూడ ద్రవ్యముకొరకు ధనవంతుల మనోరంజనము చేయవలెనని అనుకొనిన బ్రహ్మసుఖము కలుగు సాధనములు చేయజాలను. ఇట్లు ఆయన వేశ్యనుండి గుణములను గ్రహించెను. తాత్పర్యమేమన, రకరకములగు పదార్థముల యందు ఆశ కలిగి యోగము నాచరించినచో జనునకు ఎప్పటికి సిద్ధి కలుగదు. ఈ దృష్టాంతము సన్యాసికికూడ సరిపడును. మందవైరాగ్యముకలవాడు పైకి ప్రపంచమును త్యజించినట్లు ఉన్నను, ఏకాంతమున చిత్తైకాగ్రతకు ప్రయత్నించినను అంతరంగమున ఆశ ఉండుటచే "నాదగ్గరకు శేఠులు, షావుకార్లు, రాజులు, మహారాజులు రావలెను; నన్ను పూజించి నాచుట్టును ఉండవలెను" అను కోరిక కలుగును. అంతట సంసారజీవులు అర్పించు కానుకలద్వారా ఆశ లనబడు వందలకొలది పాశములయందు చిక్కుపడును. కొందరు ధనవంతులగు గృహస్థులుకూడ ఏకాంతమునందు యోగసాధన చేయుదురు. వారు ధనవంతులగుటచే వారికి కానుకలు కావలెననియు, ఇతరులు పూజ చేయవలె ననియు కోరిక ఉండదు. కాని భార్యాబిడ్డలయందు ప్రేమ అనెడు స్వాభావికమగు ఆశయుండును. ఆ ఆశకూడ మోక్షమార్గమున విఘ్నముకలుగజేయునదియే.

ఈవిషయమున శంకరాచార్యులవారి వాక్యములను వినుడు:—

*యేషామాశా నిరాశా స్యాద్దారపుత్రధనాదిషు।*
*తేషాం సిధ్యతి నాన్యేషాం మోక్షాశాభిముఖీ గతిః॥*

భార్య, బిడ్డలు, ధనము మొదలగు వానియందలి ఆశ ఎవనీ యందు నిరాశగా మారునో- అనగా, భార్య, బిడ్డలు, ధనము మొదలగు వాటియందలి ఆశ అంతరంగమునుండి వెడలిపోవునో-ఆతడే మోక్షమార్గమున సఫలత నొందును. ఇతరుడు పొందడు.

అపరిగ్రహము:- పరిగ్రహమును విడనాడి యోగము నాచరించుట. పరిగ్రహమనగా ధనాదిమాయికపదార్థములను నిలవ చేయుట.

వాస్తు, క్షేత్రం, ధనం, ధాన్యం, ద్విపదాశ్చ, చతుష్పదాః,
శయనాసనయానం చ, కుప్యం భాండమమీ దశ ॥

"ఇల్లు, వ్యవసాయము, ధనము, ధాన్యము, మనుష్యులు, పశువులు, (ఏనుగులు, గుర్రములు, ఆవులు- మొదలగునవి) శయన సాధనములు, వాహనములు, నూతులు, పాత్రలు- ఈవిధముగా పరిగ్రహము 10 రకములు."

యానపాత్రమివామ్భోధౌ గుణవానపి మజ్జతి ।
పరిగ్రహగురుత్వేన సంయమీ జన్మసాగరే ॥

"త్రాడుతో కట్టిన గిన్నె అయినను బరువుచే నీటిలో మునిగిపోవును. అటులనే పరిగ్రహమనెడు భారముచే సంయమముకలవాడైనను, సంసారసాగరమున మునిగిపోవును."

యతవాక్కాయమానసః-

ఈవిషయమున శ్రుతి ఇట్లున్నది:—

త్రిరున్నతం స్థాప్య సమం శరీరం హృదీన్ద్రియాణి మనసా సన్నివేశ్య।
బ్రహ్మోడుపేన ప్రతరేత విద్వాన్స్రోతాంసి సర్వాణి భయావహాని ॥

"పక్షము, కంఠము, మస్తకము- ఈ మూడింటిని ఎత్తుగా ఉంచవలెను. ఇట్లు శరీరమును సమరేఖయందు ఉంచవలెను. హృదయమునందు ఇంద్రియములను మనస్సుచే నిలిపి ప్రణవమను తెప్పచే విద్వాంసుడు భయముకలిగించు సంసారమనెడు నదిని దాటవలెను."

ఏకాంతస్థలమున మొదట దర్భలు, దానిపై మృగచర్మము, దానిపై వస్త్రములు పరచి ఎక్కువ ఎత్తుగాని, ఎక్కువ పల్లముగాని లేని ఆసనమున కూర్చొనవలెను. శరీరము, మస్తకము, మెడ తిన్నగ ఉంచి, నాసికాగ్రమున దృష్టి నిలిపి దేనిని చూడకుండ భ్రూమధ్యమునకాని, హృదయమునకాని చూడవలెను. అనగా నేత్రములను సగము తెరచి నాసికాగ్రమును చూడవలెను. ఇట్లు సగము తెరచి ఉంచుటకు కారణమేమన మూసినచో వృత్తి లయమయి నిద్రవచ్చును. తెరచి ఉంచినచో బాహ్యపదార్థములపై దృష్టిమరలి చిత్తమునందు సంకల్పవికల్పములు కలుగుచుండును.

## "ఓం" కారముద్వారా పరోక్షబ్రహ్మధ్యానము.

యోగసూత్రమున "తత్ర ప్రత్యైకతానతా ధ్యానం" అని ఉన్నది. ధారణాప్రదేశమున వృత్తిని స్థిరముచేయుట ధ్యానము.

వృత్తిని బ్రహ్మముతో కలుపుటకు కేవలము వృత్తి చాలునా లేక మరియొక సాధనము ఏదైన కలదా అను సందేహము కలుగును. "ఓం" అనునదియే ఆసాధనము. "ఓం" కారము బ్రహ్మముయొక్క వాచకము, బ్రహ్మము వాచ్యము. వాచ్యవాచకములకు భేదములేదు. కావున "ఓం" కారమును అవలంబనముగా తీసికొని ధ్యానించవలెను. అపరోక్షవస్తువు ధ్యానించుటకు వీలుపడును. కాని ఒకమారైనను చూడని పరోక్షవస్తువు ఎట్లు ధ్యానించబడును? అను సందేహము కలుగును. పంచదశియందలి ధ్యానదీపమున ఇందుకు సమాధానము కలదు:—

*వేదాన్తేభ్యో బ్రహ్మతత్త్వమఖణ్డైకరసాత్మకమ్ ।*
*పరోక్షమవగమ్యైతదహమస్మీత్యుపాసతే ॥*

"ఉపనిషద్వాచ్యమగు అఖండము, ఏకరసము అగు పరమాత్మతత్త్వమును పరోక్షముగా తెలిసికొని "నేను బ్రహ్మమును"

అని ఉపాసించవలెను. ధ్యానము పరోక్షముగనే జరుగును.'' పదార్థము అపరోక్షమను జ్ఞానము కలిగినతరువాత ధ్యానముచేయవలసిన అవసరములేదు.

*బోధోపాస్త్యోర్విశేషః క ఇతి చేదుచ్యతే శృణు।*
*వస్తుతన్త్రో భవేద్బోధః కర్తృతన్త్రముపాసనమ్॥* పంచదశి.

బోధ (జ్ఞానము)కును, ఉపాసనకును భేదమేమి? బోధ అనగా వస్తుతంత్రము. ఉపాసన అనగా కర్తృతంత్రము. జ్ఞానము ప్రమాణ, ప్రమేయములకు అధీనము. ఉపాసన విధి, విశ్వాసము, పురుషుడు, ఇచ్ఛ, హారము అనువాని అధీనము. కావున బ్రహ్మధ్యానము పరోక్షముగానే జరుగును.

## పరమాత్మనియందు వృత్తిని నిలుపుటకు "ఓం" కారము ఉత్తమసాధనము.

పరమాత్మని ధ్యానించుటకు "ఓం" కారముతో వృత్తిని పరమాత్మనియందు నిలుపవలెను. దీనికి ఈదృష్టాంతము నీయ వచ్చును.

చిన్నపిల్లవాడు నడక నేర్చుకొనునప్పుడు మొదట మూడు చక్రముల బండిద్వారా నేర్చుకొనును. ఆబాలుడు మొదట ఆబండి పట్టుకొని లేచి నిలబడును. దానిని ముందుకుత్రోసి దానితోబాటు ముందుకు నడచుటకు ప్రయత్నించును. ఈవిధముగా అతడు నడచుట నేర్చుకొనును. ఆత్మానుసంధానము నేర్చుకొను సాధకుడు "అ" కార "ఉ" కార "మ" కారములనెడు మూడుచక్రములు కల "ఓం" కారమనెడు బండిని ఆధారముగా తీసికొని, భక్తి, వైరాగ్యములనెడు రెండుకాళ్ళను బలముగా నేలపై నిలిపి నిలబడును. "ఓం" కారముతోబాటు వృత్తి ఉత్థానమును పొందుటచే ఆత్మను ధ్యానించ గలడు. బండి చేతినుండి జారిపోవునపుడు బాలుడు కొద్దిగా ఆగి పడి

పోవును. అటులనే "ఓం" కారము శాంతించినంతనే వృత్తి మగలును. మరల బాలుడు బండిని పట్టుకొని లేచి నిలబడి ముందుకు తోసియునట్లు సాధకుడుకూడ "ఓం" కారముద్వారా వృత్తిని పైకి పంపి, వృత్తిద్వారా, ఆత్మధ్యానమునకు ప్రయత్నించును. "ఓం" శబ్దము శాంతించినంతనే వృత్తి ఆగును.

ఇట్లు "ఓం" కారముద్వారా ఆత్మధ్యానము సులభముగా జరుగును. కావుననే "ఏతదాలమ్బనం శ్రేష్ఠం" అని శ్రుతి చెప్పుచున్నది. 'ఓం' కారమనెడు ఆలంబనము శ్రేష్ఠమయినది. కావున 'ఓం' కారముద్వారా సాధకుడు పరమాత్మని ధ్యానించవలెను.

"ఓం" కారముద్వారా ధ్యానము చేయుపద్ధతి ముండకోపనిషత్తునందు చెప్పబడినది.

*ప్రణవో ధనుః శరో హ్యాత్మా, బ్రహ్మ తల్లక్ష్యముచ్యతే,*
*అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్తన్మయో భవేత్ ॥*

"ఓం" కారము ధనస్సు, ఆత్మ బాణము, బ్రహ్మము లక్ష్యము. ప్రమత్తతను చెందని మనస్సుకల మనుష్యుడు భేదించగలడు. కావున బాణమువలె తన్మయుడవవలెను.

ధనస్సు, బాణమునకు గమనమునిచ్చు సాధనము. అటులనే "ఓం" కారము జీవాత్మయొక్క వృత్తి అనెడు గుణమునకు గమనము నిచ్చు సాధనము. బాణము లక్ష్యమునందు తన్మయత్వమును పొంది యుండును. అటులనే జీవాత్మయొక్క వృత్తి యనెడు బాణము బ్రహ్మముతో "ఓం" కారముద్వారా తన్మయత్వమును పొందవలెను. 'ఓమిత్యేవం ధ్యాయథ ఆత్మానమ్" అని శ్రుతియందు ఉన్నది. "ఓం" అని ఆత్మను ధ్యానించవలెను.

**శబ్దానువిద్ధము, శబ్దాననువిద్ధము అగు సవికల్ప సమాధి.**

"ఓం" శబ్దముతో వృత్తిని ఉత్థానముచేసి పరమాత్మను ధ్యానించవలెను. "ఓం" శబ్దముతోపాటు వృత్తికూడ ఔన్నత్య

మును పొందును. "ఓం" శబ్దము శాంతించువరకు వృత్తి పరమాత్మ యందు నిలచిఉండును. ఓంకారసహితమగు వృత్తి ఉన్నంతసేపు శబ్దానువిద్ధమగు సవికల్ప సమాధి ఉండును. నెమ్మదినెమ్మదిగా ఆలంబ నము తప్పిపోవును.

శబ్దానువిద్ధ సవికల్ప సమాధికి శబ్దవేధియగు దశరథుని వృత్తాంతము దృష్టాంతముగా చెప్పవచ్చును:—

ఒకప్పుడు దశరథుడు వేటాడుటకు వెళ్ళెను. అతడు కటికచీకటిలో జలాశయపు సమీపమున ఉన్న ఒక పొదమాటున కూర్చొని ఉండెను. ఇంచుమించు తెల్లవారుజాము నాల్గుగంటలకు శ్రవణుడు ఆనపకాయబుర్ర తీసికొని తనతల్లిదండ్రులకు జలమును తీసికొని వెళ్ళుటకు వచ్చెను. ఆతడు నీరు నింపుకొనుచుండగా 'బుడబుడ' మను శబ్దము వచ్చెను. అది దశరథుడు వినెను. ఏ ఏనుగయో తొండముతో నీరు త్రాగుచున్నదని అతడు ఊహించెను. అంతట ధనుస్సును ఎక్కుపెట్టి శబ్దము ననుసరించి గురిచూచి బాణమును విడచి శ్రవణుని కూల్చెను. ఈదృష్టాంతమున 'బుడబుడ' శబ్దముతో శ్రోత్రేంద్రియ తన్మయత్వము కలదు. శబ్దముచేయు వ్యక్తితో వృత్తికి సంబంధము కలదు. అటులనే ప్రణవరూపమగు శబ్దముతో శ్రోత్రేంద్రియమునకు సంబంధము కలదు. బ్రహ్మముతో వృత్తికి సంబంధము కలదు. ప్రణవరూపమగు శబ్దముచే అనువిద్ధమగు బ్రహ్మరూపమగు లక్ష్యమును భేదించుటకు శ్రుతి ఆజ్ఞ. వృత్తి శబ్దానువిద్ధమగునంతవరకు (శబ్దానువిద్ధమగుట అనగా శబ్దముతో కూడియుండుట) శబ్దవేధ మనబడును.

"ఓం" శబ్దము ఆగినప్పుడు వృత్తిమాత్రము ఉండును. అది శబ్ద–అననువిద్ధము అనగా శబ్దరహితము. శబ్ద–అననువిద్ధమగు వృత్తి సత్త్వపరిధానమగుచున్నకొలది సూక్ష్మత్వమును పొందును. "సూక్ష్మయా సూక్ష్మదర్శిభిః" అని కూడ శ్రుతియందు చెప్పబడినది. సూక్ష్మాతి

సూక్ష్మమగు దృష్టి కలవాడు మాత్రమే పరమాత్మను దర్శించగలడు. వృత్తి అతిసూక్ష్మము శుద్ధసత్త్వగుణమయ మయినప్పుడు ఆవరణ భంగ మగును.

## దృశ్యానువిద్ధము దృశ్యాఽననువిద్ధము అగు సవికల్పసమాధి.

దృశ్యానువిద్ధమగు సవికల్పసమాధిపద్ధతి మాండూక్యోపనిషత్తునందు చెప్పబడినది. "ఓం ఇత్యేతదక్షరమిదం సర్వమ్।" "ఓం" అనబడు అక్షరము ఇదంతయును. ప్రత్యక్షప్రమాణవిషయమగు ఈ జగత్తు అంతయు "ఓం" కారరూపము.

"సర్వం ఖల్విదం బ్రహ్మ తజ్జలానితి శాన్త ఉపాసీత" అని ఛాందోగ్యము చెప్పుచున్నది. ఈ నామరూపాత్మకమగు జగత్తు అంతయు బ్రహ్మము. ఏలనన, ఈజగత్తు దానినుండి పుట్టినది. దానియందు పెరుగును. దానియందు లయమగును. కావున శమదమాది సాధనములను సంపాదించి దానిని ఉపాసించుము.

అందుచే నామరూపములను పరిత్యజించి అస్తి, భాతి, ప్రియ రూపమగు బ్రహ్మముతో వృత్తిని కలుపుము. ఈవిషయమున మత్స్యవేధమును దృష్టాంతముగా గ్రహించవచ్చును. అర్జునుని మత్స్యయంత్రభేదనపద్ధతి ఇది:- జలకుండిమధ్యమున ఒక స్తంభము కలదు. ఆస్తంభమధ్యమున ఒక త్రాసు ఉండెను. ఆత్రాసుసిబ్బెలో నిలబడి శరీరమును సమస్థానమున నిల్పవలెను. స్తంభము పైభాగమున ఒక సువర్ణమత్స్యము వ్రేలాడతీయబడెను. అది గిరగిర తిరుగుచుండెను. అట్లు తిరుగుచున్న మత్స్యముయొక్క ప్రతిబింబము నీట పడుచుండెను. ఆప్రతిబింబముపై లక్ష్యము ఉంచి మత్స్యమును భేదించవలెను. అటులనే శరీరమును సమస్థానమున నిలిపి అర్జునుడు మత్స్యమును భేదించెను.

దృష్టాంతమున నేత్రేంద్రియసంబంధము ప్రతిబింబముతో కలిగెను. వృత్తికి బింబముతో సంబంధము కలిగెను. సిద్ధాంతమున నామ

రూపములతో నేత్రములను కలిపి, అస్తి, భాతి, ప్రియ రూపమగు బ్రహ్మముతో వృత్తిని కలుపవలెను. నామరూపములతో నేత్రసంబంధము ఉన్నంతవరకు దృశ్యానువిద్ధ సవికల్పసమాధి యుండును. నామరూపములనుండి వృత్తి తప్పుకొని అస్తి, భాతి, ప్రియ రూపమగు బ్రహ్మముతో మాత్రము సంబంధము కలిగిఉన్న, దృశ్య-అనను విద్ధమగు సమాధి అనబడును. అభ్యాసపరిపాకముచే రూపావలంబనము లేకపోయినను వృత్తి బ్రహ్మత్వము నొందగలదు. అనగా అస్తి భాతి, ప్రియ రూపమగు బ్రహ్మమును ధ్యానించగలదు.

ధ్యానముయొక్క పరిపక్వావస్థ సవికల్ప సమాధి. సవికల్ప సమాధియొక్క పరిపక్వావస్థ నిర్వికల్పసమాధి నిర్వికల్పసమాధి రెండురకములు. అద్వైతభావన, అద్వైతఅవస్థ. నిర్వికల్ప సమాధి జ్ఞానమునకు కారణము.

## సమాధికి తీవ్రవైరాగ్యము అవసరము.

వైరాగ్యమును పొంది ఏకాంతమున కూర్చొని ధ్యానించవలెనని చెప్పబడినది. కారణమేమన, వైరాగ్యము కలుగనంతవరకు సమాధి సిద్ధించదు. తీవ్రవైరాగ్యము కలవానికే సమాధి కలుగును. "తీవ్రసంవేగానామాసన్నః సమాధిలాభః" అని యోగసూత్రమున ఉన్నది. తీవ్రవైరాగ్యము కలవానికి సమాధి కలుగును.

ఈలోకమునకును, పరలోకమునకును సంబంధించిన విషయము లన్నిటియందును కాకిరెట్టయందువలె రాగాభావము కలిగి యుండుట తీవ్రవైరాగ్యము. ఆతీవ్రవైరాగ్యము కలవానికే సమాధి లభించును. ఈవైరాగ్యము లేనిదే సమాధిని అభ్యసించువానికి సిద్ధి కలుగదు. ఇట్లు అభ్యసించువానిని శాస్త్రమున అవివేకి అనిరి.

*మాతురఙ్కగతో బాలో గ్రహీతుం చన్ద్రమిచ్ఛతి ।*
*యథా యోగం తథా యోగీ సంత్యాగేన వినాఽబుధః*

తల్లి ఒడిలో నున్న బాలుడు చంద్రుని పట్టుకొనగోరును. అటులనే అవివేకి యగు యోగి సరిగా త్యాగాదులను అనుష్ఠించకుండ యోగసిద్ధిని పొందదలచును. తనయందు పూర్ణవైరాగ్యము లేనిదే తాను ధ్యానాభ్యాసములను చేసినచో ఏవిధముగను సిద్ధిని పొందడు. కావున అనిత్యపదార్థములన్నిటియందును దోషదృష్టిని కలిగియుండి పూర్ణవైరాగ్యమును సంపాదించుచు ధ్యానాభ్యాసమును చేయవలెను. అప్పటికి చిత్తైకాగ్రత కలుగనిచో నిరాశ చెందరాదు. ఈ విషయమున శ్రీగౌడపాదాచార్యులవారు ఇట్లు చెప్పిరి:—

*ఉత్సేక ఉదధేర్యద్వత్కుశాగ్రేణైవ బిన్దునా ।*
*మనసో నిగ్రహస్తద్వద్భవేదపరిఖేదతః ॥*

"కుశాగ్రముచే సముద్రజలమును ఒక్కొక్క బిందువు తోడివేయుట ఎంత శ్రమతోకూడిన పనియో మనోనిగ్రహముకూడ అటువంటిదే."

ఒకానొక పక్షి సముద్రపుఒడ్డున మేడకట్టుకొనుటకు ప్రయత్నించెను. అంతట ఆడపక్షి దానితో చెప్పెను:— సముద్రమునకు దూరముగానున్న చెట్లవద్ద మేడ కట్టుకొనెదము. లేనిచో సముద్రము పొంగి ఇల్లు కొట్టుకొనిపోవును.

అంతట మగపక్షి గర్వముతో నిట్లనెను:— సముద్రమునకు నా ఇల్లును లాగికొనిపోవు శక్తి కలదా? ఇల్లు కొట్టుకొనిపోయినచో నేను సముద్రమునకు తగినబుద్ధి చెప్పెదను. అట్లు చెప్పి ఆపక్షి ఇటుకలను పేర్చెను.

తరువాత సముద్రము పొంగి పక్షిభవనము ఇటుకలతో సహితముగా కొట్టుకొనిపోయెను. పక్షి క్రోధముతో సముద్రమునంతయు ఎండునట్లు చేయ నిశ్చయించెను. ఆ ఉద్దేశముతో అది ఎడతెగని పరిశ్రమ చేయసాగెను. మగపక్షియు, ఆడపక్షియు ఒక్కొక్క ఇసుక

రేణువును ఒడ్డునుండి తీసికొనివెళ్లి సముద్రములో పడవేయుచు, సముద్రమునుండి ఒకొక్క నీటిబిందువును తెచ్చి బయట విడచుచుండెను. ఆ ఉభయులు అట్లు ఎడతెగక ప్రయాసపడుచుండుట చూచి ఆజాతి ఇతరపక్షులు కూడ వచ్చి సముద్రమును ఎండింపజేయుటకు ప్రియత్నించసాగెను.

ఆజాతిపక్షులు చేయు ప్రియత్నము చూచి మిగిలిన అన్ని జాతుల పక్షులును వచ్చి సముద్రిమును ఎండింపజేయుటకు ప్రియత్నించెను.

పక్షులన్నియు అట్లు పరిశ్రిమ చేయుచుండ నారదమహర్షి అటువైపునకు వచ్చెను. అన్నిజాతుల పక్షులును అక్కడ గుమిగూడుట చూచి అతనికి ఆశ్చర్యమయ్యెను. ఆయన వైకుంఠమునకు వెళ్ళి గరుత్మంతునితో నిట్లనెను:- భూలోకమున మాపక్షిజాల మంతయు అవిరతపరిశ్రమము చేయుచుండ నీవు ఏకాంతముగా వైకుంఠములో కూర్చొని ఉండుట ఏమి బాగు?

నారదుని మాటలు విని గరుడునికి పౌరుషము కలిగెను. అతడు ప్రచండస్వరూపమును ధరించి, అచ్చటికి వచ్చి తన రెక్కలతో సముద్రమును అల్లకల్లోలము కావించెను. గరుడుని పక్షవేగమును భరించలేక వరుణదేవుడు ప్రిత్యక్షమయి క్షమార్పణకోరెను.

గరుడుడు క్రోధముతో ప్రిశ్నించెను:- ఈపక్షి ఇటుకలను నీవు ఏల హరించితివి? వరుణుడు సమాధానము చెప్పెను:- డంబములు పలుకుచుండెను. కావున వినోదార్థము అట్లు చేసితిని.

అంతట సముద్రిడు భవనమును యథాప్రకారముగా తిరిగి ఇచ్చెను.

తాత్పర్యమేమన, బలము నుపయోగించి ప్రయత్నించిన జగత్తున లభించనిది ఏదియు లేదు.

స్వా. ని॥:—ధ్యానయోగము చాలకష్టము. సన్యాసులకు కూడ తెలియదు. ఇక గృహస్థులు ఎట్లు చేయగలరు?

స్వా॥ ప్ర॥ :—మన డాక్టరు సన్యాసివంటివారే. ప్రస్తుతము వానప్రస్థములో ఉన్నారు. ఆయన చేయగలరు.

డా॥ లల్లూ:—వనములోనుండి వానప్రస్థధర్మమును పాటించినవాడు వానప్రస్థుడు. నేను వానప్రస్థుడనా? నేను ఇంటిలో ఉన్నాను.

స్వా. ప్ర.:-వనేషు దోషాః ప్రభవన్తి రాగిణాం గృహేషు
పఞ్చేన్ద్రియనిగ్రహస్తపః ।
అకుత్సితే కర్మణి యః ప్రవర్తతే, నివృత్తరాగస్య గృహం
తపోవనమ్॥

అని శాస్త్రము చెప్పుచున్నది.

"రాగముకలవారికి వనములందుకూడ దోషములు కలుగును. ఇంటిలోనుండి పంచేంద్రియనిగ్రహము చేయుట తపస్సు. నింద్య కర్మములయందు నిమగ్నులు కాకుండ రాగరహితులుగా ఉండు వారికి ఇల్లే తపోవనము."

కొందరు వైరాగ్యము కలుగనిదే సన్యాసము తీసికొని అడవులలోనికి వెళ్ళెదరు. మఠాదులను సంపాదించి, సకలసౌఖ్యములను అనుభవించెదరు. సన్యాసులు చేయకూడని నింద్యకర్మములను చేయుదురు. అనేకరకములుగా పాపమును పెంచుకొనుదురు. అటులనే అనేక మంది గృహస్థులకు లోపల వైరాగ్యము ఉండుటచే సకలభోగములను త్యజించి వారు ఇంద్రియనిగ్రహము చేయుదురు.

నేను క్రీ॥ శ॥ 1900వ సంవత్సరమున హృషీకేశము వెళ్ళితిని. అచ్చటి తపోవనమున చాలమంది సాధువులు, సన్యాసులు ఉండిరి. వారు యాత్రికులనుండి అనేక కపటోపాయములచే ధనము సంగ్రహిం

చెడివారు. ఎంతయో వైభవముతో కాలము గడపెడివారు. నేను క్రీ॥ శ॥ 1900వ సంవత్సరమున కచ్ఛనుండి వెళ్ళునప్పుడు మోరబీనగరమున సేఠ్, పాపటభాయి చెంత ఆగితిని. ఆయన ఊరిబయట ఆశ్రమము కట్టుకొని, తన గృహకృత్యములన్నియు కుమారునికి అప్పగించి భగవద్ధ్యానముచేయుచు కాలక్షేపము చేసెడివాడు. శంకరలాల్ శాస్త్రి అనువారివద్ద పురాణశ్రవణము చేసెడివాడు. శంకర్ లాల్ శాస్త్రి విద్వాంసుడుమాత్రమే కాదు. గొప్ప సాధువు కూడను. ఒకరోజున శాస్త్రిగారు తన డాబామీద కూర్చొని ఉండెను. ఆసమయమున ఎవడో భిక్షుకుడు అక్కడికి వచ్చెను. క్రిందిభాగమున అతని రాకను గుర్తించువారు ఎవరును లేరు. కావున అతడు ఇంటిలోనికి ప్రవేశించి చేతికి అంకిన చెంబు తీసికొని వెళ్ళిపోవుచుండెను. శాస్త్రిగారు పైన కూర్చొని ఇదంతయు చూచుచుండిరి. వెంటనే వారు క్రిందికి దిగివచ్చి ఆభిక్షుకుని వెనుకకు తీసికొనివచ్చెను. అతని బుజ్జగించి ఒకకంచము, చెంబునిండ నెయ్యి ఇచ్చి అతనిని సాగనంపెను.

ఇట్టి జనులకు ఇల్లే తపోవనము.

తరువాత సాయంకాలము ప్రకాశానందులవారిని తీసికొని డా॥ లల్లూభాయి మొదలగువారు జేతపురము వెళ్ళిరి.